క్లుప్తంగా

20 టన్నుల యూరియా మంజూరు

అట్లూరు : కొండూరు, అట్లూరు రైతు భరోసా కేంద్రాలకు 20 టన్నుల యూరియా సోమవారం వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య, హార్టికల్చర్ అసిస్టెంటు రామమోహన్‌రెడ్డి తెలిపారు. కొండూరు రైతు భరోసా కేంద్రానికి 10 టన్నులు 200 బస్తాలు, అట్లూరు రైతు భరోసా కేంద్రానికి 10 టన్నులు 200 బస్తాలు వచ్చిందన్నారు. ఇదివరకే 28–28 రకం పాస్ఫేటు అందుబాటులో ఉందని అవసరమైన రైతులు తీసుకెళ్లాలన్నారు.

బద్వేలు రూరల్ సీఐగా సుదర్శన్‌ప్రసాద్



బద్వేలు అర్బన్ : బద్వేలు రూరల్ సీఐగా ఎం.సుదర్శన్‌ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఈయన చిత్తూరు జిల్లాలోని పలు స్టేషన్లలో ఎస్ఐగా, సీఐగా పనిచేశారు. అనంతరం వైఎస్సార్ కడప జిల్లాలోని కొండాపురం సీఐగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో బద్వేలు రూరల్ సర్కిల్‌కు నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తామన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

మైదుకూరు : పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మైదుకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పేద, మధ్య తరగతి వారికి భారంగా మారిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు కోరారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి షరీఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ అనురాధకు వినతి పత్రం అందజేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం తనిఖీ

బి.కోడూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఐత్రంపేట హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో జరుగుతున్న సేవలు సక్రమంగా జరుగుతున్నాయా, 14 రకాల రక్తపరీక్షలు చేస్తున్నారా, ఓపీ ఎంత మంది వస్తున్నారు, బీపీ, షుగర్ పేషెంట్లు ఎంత మంది ఉన్నారు అని విచారణ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఇంకా మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, గౌతమి, రామతీర్థం, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

నేడు బద్రిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని బద్రిపల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

డాక్టర్ ప్రభాకర్‌కు జాతీయ పురస్కారం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఎం.ప్రభాకర్‌కు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి స్మారక సాహిత్య కళానిధి జాతీయ పురస్కారం లభించింది. ఈయన 12 పుస్తకాలు రచించడంతోపాటు సాహిత్య రంగంలో చేసిన విశేష కృషికి గాను అర్పిత అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య హైదరాబాదు వారు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో సెప్టెంబరు 11న స్మారక జాతీయ పురస్కారం అందించనున్నారు. ఈయన పద్యకవి రాజన్నకు అల్లుడు. ఈయనకు సాహిత్య కళానిధి జాతీయ పురస్కారం రావడం పట్ల జిల్లాకు చెందిన పలువురు సాహితీ వేత్తలు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఈయన శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త శ్రీకాంత్‌రెడ్డికి ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలి

పోరుమామిళ్ల : రాష్ట్రానికి ప్రత్యే హోదా తోపాటు నిత్యావసర ధరలను తగ్గించాలని సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించలేదని, అలాగే నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించి పేద మధ్య తరగతి ప్రజలను ఆదుకోవాలన్నారు. ధర్నా అనంతరం తహసీల్దారు గంగయ్యకు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు, సీపీఎం మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు చరిత్ర చాటేలా టవర్ క్లాక్

- రూ.3కోట్లతో నిర్మాణం
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



టవర్ క్లాక్ నమూనాను చూపిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు చరిత్రను చాటి చెప్పేలా అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో రూ.3 కోట్లతో టవర్ క్లాక్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. స్టూడియో ఆర్కిటెక్ట్ మోహన్ కృష్ణ టవర్ క్లాక్ నిర్మాణానికి సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 ఏళ్లుగా ప్రొద్దుటూరుకు పట్టిన దరిద్రం వదిలిందని అన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ నియోజకవర్గాన్ని ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకెళుతున్నామన్నారు. కూరగాయల మార్కెట్ నిర్మాణం, బస్టాండ్ నిర్మాణం, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి నిర్మాణం, 100 అడుగుల ఎత్తులో జాతీయ పతాకం ఆవిష్కరణ, మైదుకూరు రోడ్డులో స్మార్ట్ స్ట్రీట్ పనులు ఇలా ఎన్నో మంచి పనులతో ముందుకు దూసుకెళుతున్నామన్నారు. ప్రస్తుతం 12 సెంట్ల విస్తీర్ణంలో పుట్టపర్తి సర్కిల్ వద్ద టవర్ క్లాక్ నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. నేటి తరం ప్రజలు కోరుకునేలా ఫొటో షూట్‌కు కూడా ఈ ప్రాంతాన్ని అనువుగా తయారు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, అనుడా వీసీ ఓబులేసు నందన్, ప్లానింగ్ అధికారి శైలజ, టీపీఓ మునిరత్నం, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

జగనన్న ప్లాట్లు కొంటే మీ ఆస్తి రెండింతలు పెరుగుతుంది

ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న టౌన్ షిప్‌లో ప్లాట్లు కొంటే మీ ఆస్తి త్వరితగతిన రెండింతలు అయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అనుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎంఐజీ ప్లాట్లకు సంబంధించి సోమవారం ఆయన అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణ ప్రజలకు సెంటుకు రూ.5లక్షలు, ఉద్యోగులు సెంటుకు రూ.4లక్షలు చొప్పున చెల్లించి జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లో ప్లాట్లు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వం నిర్మిస్తున్న ప్లాట్లపై అపోహలు అనవసరమని, ప్రజల ఆస్తికి పూర్తి భద్రత ఉంటుందన్నారు. ప్రభుత్వం చేతిలో ప్రజలు మోసపోయిన సందర్భాలు ఎక్కడా లేవని, కట్టిన డబ్బుకు భద్రత ఉంటుందని చెప్పారు. లాభాన్ని ఆశించకుండా ప్రభుత్వం మధ్యతరగతి ప్రజల కోసం ఈ వెంచర్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్లాట్ల కొనుగోలుపై విష ప్రచారం మానుకోవాలని సూచించారు. అనుడా వైస్ చైర్మన్ ఓబులేసు నందన్ మాట్లాడుతూ రాయచోటిలో తొలిగా 39 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో ప్లాట్లు పూర్తిగా అమ్ముడుపోయాయని, కొత్తగా 20 ఎకరాల్లో రెండో వెంచర్ వేస్తున్నామన్నారు. రైల్వేకోడూరు, రాజంపేట, బద్వేలుతోపాటు ప్రొద్దుటూరులో 45 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ ఏర్పాటు చేశామని, ఇప్పటికే 221 మంది ప్లాట్లు కొనుగోలు చేశారని, వీరిలో 160 మంది డబ్బు చెల్లించారని వివరించారు. మొత్తం 484 ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు రూ.28.50 కోట్లతో టెండర్లు పిలిచామన్నారు. త్వరలోనే కాలనీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజి కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణం చేపడతామన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేయండి



నేలవాలిన సూచిక బోర్డు

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు నుంచి వెలవలి గ్రామానికి వెళ్లే రహదారిలో గైబూసా వంక వద్ద సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. గతంలో అక్కడ ఆర్‌అండ్‌బీ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారని, అయితే ప్రస్తుతం ఆ బోర్డు నేలవాలి విరిగిపోయింది. గత కొన్ని రోజులుగా అలానే ఉండటంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులు ఏదారి ఎటు పోతుందో తెలియక అయోమయంలో పడుతున్నారని చెబుతున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు నూతన బోర్డును ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

అన్నివర్గాల ప్రజల్లో ఆనందం



మేదరవీధిలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజల్లో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయనగర్ సచివాలయం పరిధి 16వ వార్డులోని మేదరవీధి, సుమిత్రానగర్‌లలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గడప గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ముంగిటకే అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.130 కోట్లు మంజూరు చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, కౌన్సిలర్లు లింగాల మణి, దుద్దుకూరు సత్యం, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు సుబోధ్‌కుమార్‌రెడ్డి, పుత్తా శ్రీరాములు, గురివిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, తిరుపతిరెడ్డి, అనిల్, అక్బర్, పెంచలబాబు, చెన్నయ్య, పిచ్చయ్య, సత్యరాజ్, శ్రీను, రెడ్డెయ్య, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

బద్వేలు అర్బన్ : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడంతో పాటు వారు ఆర్థికాభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మహిళలకు వివిధ పథకాల ద్వారా సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడి క్యాంటీన్ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న ఉద్దేశ్యంతో మహిళా సంఘాలలోని సభ్యులతో జగనన్న మహిళా మార్టులు, అర్బన్ మహిళా మార్కెట్‌లు ఏర్పాటు చేయిస్తున్న ప్రభుత్వం ఆహా క్యాంటీన్‌లు కూడా ఏర్పాటు చేయిస్తోందన్నారు. ఆహా క్యాంటీన్ ద్వారా రోజువారీ కూలీలు, కార్మికులు, పేదలు తక్కువ ధరకే రుచికరమైన ఆహారాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్ రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, కౌన్సిలర్ సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జిలు పుత్తాశ్రీరాములు, చెన్నకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, మెప్మా టీఎంసీ అయ్యవారయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



అమ్మ ఒడి గురించి పిల్లలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో కులమతాలకు, పార్టీలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం మైదుకూరు మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేశలింగాయపల్లె, బండివారిపల్లె గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుంచి వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా పొందిన లబ్ధిని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2014లో అధికారంలో ఉన్న టీడీపీ ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. పింఛన్లు, పక్కా ఇళ్లు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు ఉంటేనే వచ్చేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కర ఆదరించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కోరారు. వార్డులో జగనన్న అమ్మ ఒడి కింద 87 మందికి రూ.53లక్షలు, జగనన్న విద్యాదీవెన కింద 45 మందికి రూ.14,72,000, జగనన్న వసతి దీవెన కింద 37 మందికి రూ.11,32,000, చేయూత కింద ఆరుగురికి రూ.3.50లక్షలు, చేదోడు కింద ఇద్దరికి రూ.60వేలు, కాపు నేస్తం కింద 59 మంది మహిళలకు రూ.26,10,000, వైఎస్సార్‌రైతు భరోసా కింద 179 మందికి రూ.72.90లక్షలు, వైఎస్సార్ ఆసరా కింద 139 మందికి రూ.27.47 లక్షలు, సున్నా వడ్డీ కింద 174 మందికి రూ.11.72 లక్షలు, 130 మందికి వివిధ రకాల పెన్షన్ల పంపిణీ కింద రూ.కోటి 19 లక్షల 93వేలు మొత్తం సంక్షేమ కార్యక్రమాల ద్వారా మూడు కోట్ల 42 లక్షల 48వేల రూపాయలు అందించినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వార్డు కౌన్సిలర్ ఏసీకే సునీత, స్థానిక నాయకులు ఏసీకే వెంకటరమణ, ఏసీకే చెంద్రాయుడు, పసల పోతులూరు, భూమిరెడ్డి, శ్రీనివాసులు, కేపీ వెంకటరమణ, రవి రెడ్డి, మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 7 నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

గోపవరం : ఈనెల 7వ తేదీ నుంచి మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల క్రీడాపోటీల కన్వీనర్లు సుబ్బారావు, ప్రభాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్‌బాడ్మింటన్, షటిల్, యోగా అథ్లెటిక్స్ క్రీడాపోటీలు ఉంటాయన్నారు. ప్రభుత్వ ఎయిడెట్, మున్సిపల్, వెలుగు, ప్రైవేటు పాఠశాలలకు చెందిన అండర్–14, 17 బాలబాలికలు మాత్రమే అర్హులన్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఈనెల 6వ తేదీ లోపు మండల కన్వీనర్లను కలిసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 9441984484, 9966673577 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి



ఎరువుల దుకాణంలో స్టాకు పరిశీలిస్తున్న ఏడీఏ

గోపవరం : ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ డీలర్లను ఆదేశించారు. సోమవారం బద్వేలు పట్టణంలోని సి.వి.మోహన్‌రాజ ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎరువులపై కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నందున డీబీటీ సేల్స్ చేపట్టాలని, రైతులతో బయోమెట్రిక్ వేయించుకుని ఈ–పాస్ మిషన్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలన్నారు. రైతుల వివరాలతో పాటు మొబైల్ నెంబర్‌ను నమోదు చేయాలన్నారు. రైతులకు అవసరమైన మేరకే ఎరువులను విక్రయించాలని, అంతకు మించితే సంబంధిత అధికారుల అనుమతి తీసుకుని విక్రయించాలన్నారు. దుకాణంలోని ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అనంతరం మడకలవారిపల్లెలో జరుగుతున్న ఈ–పంట నమోదును పరిశీలించారు. ఈ–పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలన్నీ వర్తిస్తాయని తెలిపారు.

ఇద్దరు ప్రొద్దుటూరు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



వేణుగోపాల్ రావు, ప్రధానోపాధ్యాయుడు



షేక్ బాబు, ఫిజికల్ డైరెక్టర్

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ప్రొద్దుటూరు మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో ఒకరు డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సానా వెంకట వేణుగోపాల్ రావు. 1985 ఆగస్టులో రామేశ్వరం మున్సిపల్ హైస్కూల్‌లో బయాలజీ ఉపాధ్యాయుడుగా విధుల్లో చేరిన ఆయన ఆ తర్వాత అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, నడింపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో విధులు నిర్వహించారు. 2010లో ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొంది డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆ పాఠశాలలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

- మరొక ఉపాధ్యాయుడు ఖాదర్‌బాద్ జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ షేక్ బాబు. 1996లో వెలిదండ్ల జెడ్పీ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. తర్వాత కొండాపురం, దొరసానిపల్లె జెడ్పీ హైస్కూళ్లలో పనిచేశారు. 2009లో ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది ముద్దనూరు జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. ఆ తర్వాత చాపాడు జెడ్పీ హైస్కూల్, ప్రస్తుతం ఖాదర్‌బాద్ జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కొండాపురం జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్నప్పుడు ఆ పాఠశాల విద్యార్థులు రెండు సార్లు బెస్ట్ ఇన్ స్పోర్ట్స్, ఆల్ రౌండ్ ఛాంపియన్ షిప్ సాధించారు. దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో పనిచేసేటప్పుడు ప్రొద్దుటూరు జోనల్ స్థాయి పోటీల్లో బెస్ట్ ఇన్‌గేమ్స్, బెస్ట్ ఇన్ స్పోర్ట్స్, ఆల్ రౌండ్ ఛాంపియన్ షిప్ విద్యార్థులు సాధించారు. 2015లో క్రీడా సంకల్ప అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.


మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి



మాట్లాడుతున్న మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

బి.కోడూరు : మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలోని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ కోడూరు చెన్నమ్మ తెలిపారు. సోమవారం బి.కోడూరులోని వెలుగు సభా భవనంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డిలు హాజరై మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో మౌళిక వసతులైన విద్య, తాగునీరు, వైద్యం, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాఖలవారీగా జరుగుతున్న పనులను, తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణ పనులు, పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. అర్హులైన వారికి పక్కా గృహాలను మంజూరు చేయాలని హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్యను కోరారు. మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని విద్యుత్ అధికారులు చొరవ చూపి ప్రజలు అసౌకర్యాలకు గురికాకుండా చూడాలన్నారు. అలాగే పొదుపు సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీనిధి నగదులో అక్కడక్కడ అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అందకు కారకులైన వారిని గుర్తించి పొదుపు సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని ఏపీఎం సీతారామిరెడ్డికి సూచించారు. మాధవరాయునిపల్లె, రెడ్డివారిపల్లె, దంతెలపల్లె తదితర పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు మునిరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, ఎంపీటీసీలు గాజులపల్లె తేజస్విని, పీఆర్ ఏఈ నారాయణరెడ్డి, ఎంఈఓ సురేష్‌కుమార్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మనబడి నాడు–నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. కొన్ని పాఠశాలల్లో 50 శాతం పనులు కూడా జరగలేదని, అవన్నీ కూడా వేగవంతం చేయాలన్నారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాలను ఈ నెలాఖరు లోపు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను వెంటనే మొదలుపెట్టాలని సూచించారు. పంట నమోదు పక్కాగా జరగాలని, వ్యవసాయ, రెవెన్యూ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఆడదాం ఆంధ్రకు సంబంధించి ఇప్పటి వరకు ఎంత మంది ఆయా సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకున్న వారి వివరాలను మంగళవారం సాయంత్రంలోపు పంపాలన్నారు. 15 సంవత్సరాలు పైబడిన వారు మాత్రమే ఆడదాం ఆంధ్ర క్రీడలకు అర్హులని ఆయన తెలిపారు. సచివాలయ సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొనకూడదన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వచ్చిన విన్నపాలను పరిష్కరించడంతో పాటు వారి ఈకేవైసీలను నమోదు చేయించాలన్నారు. అనంతరం అన్నిశాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంఈఓ రఘురాములు, పశువైద్యాధికారి కృష్ణవేణి, ఈఓపీఆర్డీ హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఏపీఎం శివప్రసాద్, పీఆర్ ఏఈ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి

కాశినాయన : అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని జెడ్పీటీసీ డి.సత్యనారాయరెడ్డి, ఎంపీపీ ఎస్.పోలమ్మలు తెలిపారు. సోమవారం నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో ఎంపీడీఓ మైథిలి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. సచివాలయాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, ఐసీడీఎస్, విద్య, వైద్య, పారిశుధ్యం తదితర అంశాలపై చర్చ సాగించారు. తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, ఎంఈఓ నిర్మల, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఏపీఎస్‌పీడీసీఎల్, హౌసింగ్ ఏఈలు సందీప్, పుల్లయ్య, బాలిరెడ్డి, మురళీకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ధర్నా

ప్రొద్దుటూరు : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సమర భేరిలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలపై నిత్యావసర వస్తువుల ధరలను పెంచి భారం మోపుతోందని విమర్శించారు. ప్రజల సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం ఇచ్చారు. ముంతాజ్ బేగం, వెంకటసుబ్బమ్మ, భానుమతి, సర్వేశ్వరి, లక్ష్మీదేవి, రాములమ్మ, సీపీఎం నాయకులు చెన్నారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.